క్లుప్తంగా

ఘనంగా అన్నసమారాధన



నాంచారమ్మ గుడి వద్ద కార్తీకమాస అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉండి: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా పేరుగాంచిన నాంచారమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం నిర్వాహకులు భక్తులకు కార్తీకమాస అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీకమాస సందర్భంగా బాలాజీరావుపేట, నిమ్మనపేట, కాపులపేట, కోండ్రోతుపేట, చిక్కాల వీరన్న నగర్ తదితర ప్రాంతాల నుండి వందల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని అన్నసమారాధనలో పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలో ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 19 నెట్‌బాల్ పోటీల్లో భీమవరం సీఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీంఖాన్ తెలిపారు. శుక్రవారం క్రీడాకారులను అభినందించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. అండర్-19 బాలుర జట్టులో తమ కళాశాల విద్యార్థులు ఎం ఎర్నెస్ట్, డి ఫణీంద్ర కుమార్, టి కేశవ మణికంఠ, ఎండి జుబేర్, ఎం వేణుగోపాల్, కె హనుకు, ఎం భాస్కరరావు, బాలికల జట్టులో ఎస్ పావని, షేక్ సైరాభాను, ఆర్ మహిమారాణి, ఎం. జాన్సీలక్ష్మి, ఎం మౌనిక, ఎం బేబీరాణి , ఎం దివ్యశ్రీ, అండర్-17 బాలుర విభాగంలో జి త్రినాథ్, డి రాజేష్ ఉన్నారన్నారు. విజేతలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ సలీంఖాన్, కోచ్ దావూద్‌లు అభినందించారు.

నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీస్‌తో ఎస్ఆర్‌కేఆర్ ఎంఓయు



నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీస్‌తో ఎంఓయు చేసుకున్న పత్రాలను చూపుతున్న దృశ్యం

భీమవరం: ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు యూఎస్ఏలోని పేరెన్నికగన్న విద్యాలయాల్లో విద్యనభ్యసించేందుకు యూఎస్ఏలోని నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీస్‌తో ఎంఓయు చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 13వ తేదీన ముంబైలో జరిగిన కార్యక్రమంలో నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ అసిస్టెంట్ వైస్ ఛాన్సలర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎన్రోల్మెంట్ మేనేజ్మెంట్ ఫెడరీకోలింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ పార్ట్నర్ షిప్ ఫర్ సౌత్ ఆసియా ఎన్రోల్మెంట్ మేనేజ్మెంట్ జంగా వంశీకృష్ణతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కళాశాల ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రిప్రజెంటేటివ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ ఈఎంఓయూ వల్ల నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఉన్నత విద్యకు ఎస్ఆర్‌కెఆర్ కళాశాల నుంచి వెళ్లే విద్యార్థులకు ఫీజుల్లో కొంతమేరకు రాయితీతోపాటు విద్యార్థులకు స్కాలర్ షిప్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తారన్నారు. ఇటువంటి అవకాశాల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెదమల్లంలో తాటాకిల్లు దగ్ధం

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లం శివారు సిర్రా వారి పేటలో శుక్రవారం తాటాకిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. లంక ధనరాజుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. భార్య, కుమారుడు పనులకు వెళ్లగా, కుమార్తె కళాశాలకు వెళ్లడంతో ఇంటిలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. పాలకొల్లు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. బంగారం, రూ.80 వేలు నగదు, ఇంటిలోని సామాను పూర్తి కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మీ, ఆర్ఐ లక్ష్మీ, వీఆర్ఓ శేషగిరిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గ్రామసభల్లో భూ-సమస్యల పరిష్కారం

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.రాజ కిశోర్ సూచించారు. శుక్రవారం మొగల్తూరు 3వ సచివాలయ పరిధిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీ-సర్వేలో ఏమైనా సమస్యలుంటే గ్రామ సభల్లో ఫిర్యాదు ఇస్తే వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఆ రహదారి ప్రమాదాలకు నిలయం

- జాతీయ రహదారి-165 పొడవునా కాలువ రేవులతో ఇబ్బందులు
- ఎన్ని ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు



ఉండిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాలువ రేవు



ఉండిలో కాలువలో పడిపోయిన వాహనదారుడిని పైకి లాగుతున్న స్థానికులు(ఫైల్)

ఉండి: జాతీయ రహదారి 165 ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి పొడవునా ఉండి కాలువ ఉండటంతో స్థానికులు అవసరాల కోసం రేవుల నిర్మించుకోవడం తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉండి సెంటర్ నుంచి యూనియన్ బ్యాంక్ సెంటర్ వరకు అత్యంత ప్రమాదకరంగా ఉంది. రోడ్డులోకి చొచ్చుకొచ్చే విధంగా రేవుల నిర్మాణం జరగడంతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. అలాగే రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కలిసిపూడి, చెరుకువాడ గ్రామాలతో పాటు ఆకివీడు మండలం అజ్జమూరు సరిహద్దు వరకు సుమారు 8 కిలో మీటర్ల మేర ఉండి కాలువ జాతీయ రహదారిని ఆనుకుని ప్రమాదరకంగా మారింది. చెరుకువాడ గ్రామ పరిధిలో ఉండి కాలువ వల్ల రోడ్డు కుంగిపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయారు.

రాత్రి సమయంలో మరింత ఇబ్బంది

ఎన్నో ఏళ్లుగా కళ్ల ముందే ప్రమాదాలు జరుగుతున్నా జాతీయరహదారి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల వెలుగుతో రోడ్డు సరిగ్గా కనిపించక సరాసరి రేవుల్లోకి దూసుకుపోతున్నారు. ముఖ్యంగా ఉండి సెంటర్‌లో సెఫ్టీ వాల్ నిర్మాణం చేపట్టాలని వాహనదారులు ప్రయాణికులు కోరుతున్నారు. ఉండి సెంటర్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో ఉండి కాలువపై ఎన్నో ఏళ్ళ క్రితం వాల్ నిర్మించారు. అదే విధంగా కాలువపొడవునా సెఫ్టీ వావాల్ నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుకుంటున్నారు.

ప్రజల ప్రాణాలు కాపాడాలి



ఎన్నో ఏళ్లుగా చెరుకువాడలో పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఉండి కాలువ వల్ల రోడ్డు కుంగిపోవడంతో చెరుకువాడ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారిపోయింది. ఇకనైనా అధికారులు ప్రమాదాల నివారణకు తప్పకుండా చర్యలు చేపట్టాలి. ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు అధికారులపైనా ఉంది.

– కొండవేటి సాంబశివరావు, సర్పంచ్,చెరుకువాడ,ఉండి మండలం.

ప్రయాణం అంటే భయమేస్తుంది



పేరుకే జాతీయ రహదారి 165 కానీ రోడ్డెక్కితే ఎక్కడ ప్రమాదం జరుగుతుందో అని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. రోడ్డు అంతంత మాత్రమే దానికి తోడు రోడ్డు పొడవునా కాలువ రేవులే. కనీసం రోడ్డు వైపు ఉన్న రేవులు పూడిస్తే బాగుంటుంది. అలాగే హెచ్చరికబోర్డులు కూడా త్వరగా ఏర్పాటు చేయాలి.

– అందుకూరి రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, ఉండి

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

ఉండి: అధికారంలోకి రాగానే వీఆర్ఏల సమస్యలు తీర్చేందుకు మూడు నెలలు సమయం కావాలన్నారు. కానీ ఇప్పుడు ఐదు నెలలైనా తీరుస్తారా అంటూ వీఆర్ఏ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పీల్లి సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఉండి మండల వీఆర్ఏల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీఆర్ఏల సమస్యలు తీర్చాలని రెవెన్యూ మంత్రి, ఇతర మంత్రులను కలిశామన్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడింది కదా మూడు నెలలు సమయం కావాలని కోరారని తెలిపారు.మూడు నెలలు కాస్త ఇప్పుడు 5 నెలల అయ్యిందని మండిపడ్డారు.కానీ వీఆర్ఏల సమస్యలు తీర్చేందుకు ఎటువంటి సమాచారం రాలేదని అన్నారు. అందుకే వినూత్నంగా గతంలో జిల్లా కలెక్టర్‌లకు వీఆర్ఏలు రాయబారం పంపారన్నారు. ఇప్పుడు రెండోదశలో భాగంగా సీసీఎల్ఏకి రాయబారం పంపే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు, నల్లబ్బాయి, అచ్చయ్య, డానియల్, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

భీమవరం(ప్రకాశం చౌక్): కార్తీక పౌర్ణమి సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి ఆలయలంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పరివేక్షణలో వేద పండితులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా చండీ హోమం నిర్వహించారు. ఈహోమంలో 87 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కాళ్ల: తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎస్సీ బోస్ కాలనీ గ్రామానికి చెందిన బెంజిమెన్‌కు వివాహం అయ్యింది. ఇద్దరు సంతానం ఉన్నారు.గురువారం సాయంత్రం బయటకువెళ్లి వస్తానని తిరిగి ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి సుందరరావు పోలీసులను ఆశ్రయించాడు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆకివీడు: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై అరుణప్రియ శుక్రవారం చెప్పారు. పద్మనాభుని చిన్నారాయణ అనే వ్యక్తి వద్ద 9 బ్రాందీ స్వాధీనం చేసుకున్నట్లు కరుణ ప్రియ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



ఉండి: శిక్షణకు హాజరైన అధికారులతో ఎంపీడీఓ, తహసీల్దార్



కాళ్ల: శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధికారులు

ఉండి: గ్రామాలను అన్ని రంగాల్లోను అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ ఎస్.రవీంద్ర అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాదేశాల మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులకు 2025-26 ఏడాదికి గానూ గ్రామ పంచాయితీ,మండల పంచాయితీ,జిల్లా పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవీంద్ర, తహసీల్దార్ కె.నాగార్జున మాట్లాడుతూ గ్రామాల్లో లభించే అన్ని రకాల వనరులను దృష్టిలో ఉంచుకుని గ్రామాన్ని సామాజికంగాను,ఆర్థికంగాను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రెడ్డి ,ఎస్సై నసీరుల్లా తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతుల్లో గ్రామ పంచాయతీ ప్రణాళిక అభివృద్ధి, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక 2025-26కు సంబంధించి శిక్షణ తరగతుల్లో పలు అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

ప్రజలపై మోపిన బారాలను తగ్గించాలి



కొత్త పూసలమర్రు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రజలపై మోసిన అధిక ధరలు, విద్యుత్ భారాలను తగ్గించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. భీమవరం మండలంలోని కొత్త పూసలమర్రు గ్రామంలో శుక్రవారం ఈనెల 18న సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ప్రజా సమస్యల కోసం చేపట్టబోయే ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోణాల భీమారావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారని, తీరా అధికారం చేపట్టి ఐదు నెలల దాటుతున్న దాని ప్రస్తావన లేదని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో సూపర్ సిక్స్ పథకాల గురించి నిధులు కేటాయించకపోవడం చూస్తే చంద్రబాబు నైజం బయటపడిందన్నారు. గతంలో 2014లో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టాక అప్పటి సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని శ్రీరాములు, శ్రీను, బస్వాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం భవిష్యత్‌కు మంచి నేస్తం



గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉండిలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: పుస్తకం మన భవిష్యత్‌లో ఓ మంచి నేస్తంగా నిలిచిపోతుందని రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ బొండాడ వెంకటసత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఉండి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం అనేది చాలా మంచి లక్షణమని, విద్యార్థులు పుస్తక పఠనం ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదునూరి గోపాలరాజు, అంగర సునీల్, గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే యండగండి శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు క్యారమ్స్ పోటీలను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రవికుమార్ ప్రారంభించారు. పి.మమత జడ్జిగా వ్యవహరించిన క్యారమ్స్ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వేగేశ్న సత్యరాజ్, గ్రంథాలయ అధికారి ఎస్‌సీహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం

భీమవరం: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా అడిషినల్ ఎస్పీ వి భీమారావు అన్నారు. 57వ జాతీయ శాఖా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం భీమవరం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో పుస్తకప్రదర్శన ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పుస్తక ప్రదర్శనలో నీతి కథలు, మహనీయులు జీవితచరిత్రలు, జనరల్ నాలెడ్జ్ వంటి పుస్తకాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని మనిషి అదుపు తప్పి సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ ఎస్ కృష్ణాజీ, గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు , మహిళాపోలీసు షెహ్నాజ్, డి రామనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



భీమవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న భీమారావు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పాలకోడేరు: ప్రస్తుత కాలంలో యువత మారక ద్రవ్యాలకు అలవాటై జీవితం నాశనం చేసుకుంటున్నారని వాటికి దూరంగా ఉండాలని గొల్లలకోడేరు పంచాయతీ సెక్రెటరీ ఎస్. నాగేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయంలో జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పుస్తక ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.బాలరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుష్పరాజ్

భీమవరం: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా తెలంగాణ తరహాలో ఆంధ్ర మాలప్రజా ప్రతినిధులు బయటకు వచ్చి పోరాటం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం భీమవరంలో ఏర్పాటు చేసిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో మాల ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు నోరు విప్పకపోవడం దారుణమని, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలోనైనా నోరువిప్పి గళాన్ని వినిపించాలన్నారు. రిజర్వేషన్స్ పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివరించాలన్నారు. ఇకనైనా మాల ప్రజా ప్రతినిధులు పార్టీలకు అతీతంగా వర్గీకరణ వ్యతిరేకంగా పోరాటంలో భాగస్వాములై మన హక్కులు సాధించుకునేలా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, వినోద్ కుమార్, దాసరి చిరంజీవి, కోలాటి ప్రసాదరావు, పొడపాటి యాకోబు తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా ఆశయ సాధనకు కృషి చేయాలి



బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): భారతదేశంలో బ్రిటిష్ వారితో ధైర్యంగా పోరాడిన గిరిజన నాయకుడు భగవాన్ బిర్సాముండా అని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేటు వశిష్ఠ కాన్ఫరెన్స్ హాలు నందు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఆంగ్లేయుల మన దేశాన్ని పాలించే రోజులలో వారి అరాచకాలను ఎదిరించిన ఆదివాసీ యోధుడు బిర్సా ముండా ఒకరిని అన్నారు. బిర్సా ముండాను స్ఫూర్తిగా తీసుకోవాలని గిరిజన నాయకులకు, బాలికలకు సూచించారు. ప్రస్తుత సమయంలో పుస్తకాలకు సంబంధించిన విజ్ఞానం కొరవడుతుందని, స్వాతంత్ర సమరయోధుల వారి జీవిత చరిత్రను నేటి విద్యార్థులు చదివి చైతన్యం కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, వసతి గృహం అధికారి డి.శ్రీనివాసు, టైపిస్ట్ బి.కమలకుమారి, జూనియర్ అసిస్టెంటు జి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాసోమేశ్వర స్వామికి కార్తీక పౌర్ణమి పూజలు



ఆలయంలో కార్తీక మాస పూజలు నిర్వహిస్తున్న భక్తులు



శ్రీరాంపురంలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆకివీడు: వెలంపేట రామాలయం వద్ద కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



చెన్నకేశవునికి ద్రాక్షపండ్లతో అభిషేకం

భీమవరం (ప్రకాశం చౌక్) : భీమవరం పంచారామ క్షేత్రంలో ఉమాసోమేశ్వరస్వామి వారికి కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, సోంబాబు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, లక్ష పత్రి పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని శ్రీరాంపురం రోడ్డులోని జగన్మాత కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక అనంత దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆకివీడులో..

ఆకివీడు: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి కేదారేశ్వర స్వామి నోములు నోచుకున్న భక్తులు ఉదయం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 365 ఒత్తులతో దీపారాధన చేశారు. స్థానిక వేలంపేట రామాలయం వద్ద లక్షదీపార్చన నిర్వహించారు భీమేశ్వర స్వామి ఆలయం వెంకట లింగేశ్వర స్వామి ఆలయం మాదివాడలోని మల్లేశ్వర స్వామి ఆలయాల వద్ద జ్వాలా తోరణాలు వెలిగించారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

ఉండి: స్థానిక రాజులపేటలో ఉన్న పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ద్రాక్షారసంతో అభిషేకం, ద్రాక్షపండ్లతో అలంకరణ చేశారు. అలాగే ఉండి, చెరుకువాడ, మహదేవపట్నం, ఉప్పులూరు, కోలమూరు, ఆరేడు, యండగండి, పెదపుల్లేరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.